క్లుప్తంగా

రోడ్లపై చెత్త వెంటనే తొలగించండి

అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మిపతి



తెనాలిఅర్బన్: రోడ్లపై ఉన్న చెత్తను వెంటనే తొలగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మిపతి పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్‌లో గురువారం ఉదయం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మూడు బుట్టల విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు పట్టణంలో ఉత్పత్తి అయ్యే చెత్తను సేకరిస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

గోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ



తెనాలి: ధనుర్మాసం సందర్భంగా స్థానిక మారీసుపేటలో వేంచేసి ఉన్న శ్రీకోదండ రామస్వామి దేవస్థానం (అప్పలస్వామి గుడి) శ్రీకృష్ణస్వామితో కొలువై ఉన్న గోదాదేవికి గురువారం శ్రీదుర్గాపూర్ణ కుమారి భవజ్ఞి మండల సభ్యులు సారే సమర్పించారు, అనంతరం ధర్మకర్తలతో స్వామి వారిని గ్రామోత్సవానికి తీసుకువెళ్లారు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు, అలాగే రాబోవు ముక్కోటి ఏకాదశికి దేవస్థానంలో ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేసి స్వామివారిని విశేషంగా అలంకరిస్తామని తెలియజేశారు. ధర్మకర్తల మండలి సభ్యులు కూనపల్లి నారాయణస్వామి, లంక శివానంద కుమార్, లంక శివ ఆంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు దినమని ధనుష్ సుబ్రమణ్యశర్మ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోటేశ్వరరావు, కాకుళను లక్ష్మీనారాయణ, భవానిమండలి సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా అబాకస్ పోటీల్లో నెహ్రూనికేతన్ విద్యార్థుల ప్రతిభ



తెనాలిఅర్బన్: హైదరాబాద్‌కు చెందిన విశ్వ ఎడ్యుటెక్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో నెహ్రూనికేతన్ స్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ చూపారని స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ తెలిపారు. సీనియర్ విభాగంలో వి.చరిష్మ ప్రథమస్థానం, శ్రీ విద్య తృతీయ స్థానం, జూనియర్ కేటగిరిలో ఎ.దుండి కార్తీకేయ ప్రథమస్థానం సాధించినట్లు తెలిపారు. విజువలైజేషన్ విభాగంలో షేక్ తబసుమ్, కె.తరుణిలు వివిధ స్థానాలు సాధించినట్లు చెప్పారు. వీరందని గురువారం పాఠశాల ఆవరణలో అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన విద్యార్థులు



తెనాలి: రూరల్ మండలం నందివెలుగులో సమగ్ర వ్యవసాయ విధానం అమలుచేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం విజయవాడ ఎనికేపాడులోని విజ్ఞాన విహార ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు సందర్శించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా నందివెలుగులోని పంటపొలంలో సాగుచేస్తున్న వివిధ రకాల కూరగాయల పంటలను పరిశీలించారు. అక్కడి స్వచ్ఛ ఆహార రైతు ఉత్పత్తి దారుల సంఘం, రిటైల్ అవుట్‌లెట్, ఆర్గానిక్ ఉత్పత్తులను పరిశీలించారు. వ్యవసాయ క్షేత్రం రైతు మీసాల రామకృష్ణ వారికి వివరాలను తెలియజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మానవత'చే సిమెంటు బెంచీల వితరణ

తెనాలి: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అన్న కాంటీన్‌లో వృద్ధులు, వికలాంగులు కూర్చుని భోజనం చేయటం కోసం సుమారు రూ.16 వేల ఖర్చుతో నాలుగు సిమెంట్ బల్లలు బహూకరించారు. సంస్థ తెనాలి చైర్మన్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ, సంస్థ ద్వారా అందించే కార్యక్రమాలు ఒక క్రమ పద్ధతిలో జరిగేవిధంగా, ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్ మాట్లాడుతూ బెంచెస్ డొనేట్ చేయటం సంతోషంగా ఉందన్నారు. మహిళా విభాగ అధ్యక్షురాలు కె.కళ్యాణి మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవా అనే దక్పథంతో మానవత సంస్థ కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు.

ఫిజియోథెరఫీ కేంద్రం సేవలతో స్వాంతన

- జిల్లా వైద్యశాలలో విస్తృతమవుతున్న సేవలు
- రోజురోజుకూ పెరుగుతున్న రోగుల సంఖ్య



ఫిజియోథెరఫీ కేంద్రానికి వచ్చిన రోగులు

తెనాలిఅర్బన్: స్థానిక జిల్లా వైద్యశాలలోని ఫిజియోథెరఫీ కేంద్రం సేవలు విస్తృతమయ్యాయి. సచ్చుపడిపోయిన కాళ్లు, చేతులు, మూతి వంటి అవయవాలకు వివిధ పరికరాల ద్వారా వాటిలో కదలికలు తేవటం. మోకాళ్ల నొప్పులు ప్రారంభ దశలో ఉంటే వాటికి ఇక్కడ చికిత్స అందించటం వంటివి చేస్తున్నారు. అంతేకాకుండా కండరాలు, మెడల నొప్పులకు వివిధ వస్తువులతో ఇక్కడ చికిత్స అందిస్తు ఉపసమానాన్ని కలిగిస్తున్నారు. దీంతో .. ఫిజియోథెరఫీ కేంద్రానికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది.

తెనాలి జిల్లా వైద్యశాలలో 2002లో .. ఫిజియోథెరఫీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో చిన్నచిన్న వస్తువులను దానిలో ఏర్పాటు చేసి వాటి ద్వారా చికిత్స అందిస్తుండేవారు. అక్కడికి వచ్చిన రోగులకు ఎక్సర్‌సైజులు చేపించి పంపేవారు. 2016లో జాతీయ వయో వృద్ధుల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా దీనిలో నాన్ కమ్యునికల్ డిసీజ్ అండ్ జిరియాట్రిక్ క్లినిక్‌గా దీనిని మార్పు చేశారు. దీంతో ప్రభుత్వం దీనికి కావల్సిన వస్తువులను తెనాలి పంపి కేంద్రాన్ని అభివృద్ధి చేసింది. అప్పటి నుంచి వయో భారంతో వచ్చే సమస్యలకు, పక్షవాతం, కీళ్ల, కండరాల నొప్పులు వంటి వాటికి ఇక్కడ చికిత్స అందిస్తు వస్తున్నారు.

పెరుగుతున్న రోగుల సంఖ్య

తెనాలి ఫిజియో థెరఫీ కేంద్రం ప్రారంభించిన సమయంలో నెలకు సుమారు 50 మంది వరకు వచ్చి చికిత్స పొందుతుండే వారు. దీని సేవలను విస్తరించటంతో పాటు అక్కడ పలు రకాల వస్తువులను ఏర్పాటు చేయటంతో నేడు ప్రతినెల సగటున 900 మంది వరకు ఇక్కడికి వచ్చి వివిధ రకాల చికిత్సలు పొందుతున్నారు. అంటే ఏడాదికి 10,800 మంది ఇక్కడ చికిత్స పొందుతున్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇక్కడ సేవలు అందిస్తున్నారు. తెనాలి జిల్లా వైద్యశాలలోని ఫిజియో థెరఫీ కేంద్రం వృద్ధులకు, పక్షవాతం రోగులకు, వివిధ నొప్పులతో బాధపడే వారికి ఉపయోగపడుతుందనటంలో ఎటువంటి సందేహం లేదు.

సేవలు ఇలా...

మజిల్ స్టిమ్యులేటర్: ఇది పక్షవాతం వచ్చిన వారికి కదలిక తెప్పించేందుకు ఇది దోహదపడతుంది.

ఇన్ఫ్రారెడ్ థెరఫి: చిన్న చిన్న నొప్పులు, బెణుకులు, కండరాల నొప్పుల నివారణకు ఉపయోగపడుతుంది.

టెన్స్: నరాల నొప్పులు, తిమ్మరలు, మెడల జాలు తగ్గించేందుకు ఉపయోగపడుతుంది.

షార్ట్ వెవ్ దయోథెర్మీ: భరించలేని నొప్పులు, మోకాళ్ల, బుజం నొప్పుల ఉపసమానానికి పనిచేస్తుంది.

అల్ట్రాసౌండ్ థెరఫి: మోచేతి కండరాల నొప్పులు, కాలు బెణుకుల తగ్గించడానికి ఉపయోగపడుతుంది.

ఇన్టర్ ఫెరిన్షియల్ థెరఫీ: నడుము నొప్పులు, కాలు జాలుకు ఉపయోగపడుతుంది.

వాక్స్ థెరఫీ: మడమ నొప్పులు తగ్గడానికి ఉపయోగపడుతుంది.

ట్రాక్షన్: మెడ,నడుము నొప్పులకు ఉపయోగపడుతుంది.

పుల్లి ఎక్సర్‌సైజ్: భుజం నొప్పులకు, క్వార్డిసెప్స్: మోకాళ్ల కండరాల దృఢత్వానికి, పలు ఎక్సర్‌సైజ్ మిషన్‌లు ఉన్నాయి. నొప్పుల స్థాయిని బట్టి వీటిని ఉపయోగించటం ద్వారా అవి పూర్తిగా తొలగే అవకాశం ఉంటుంది.

ఇప్పుడు నడవగలుగుతున్నా



నెల రోజుల క్రితం పక్షవాతం వచ్చింది. కుడి కాలు, కుడి చెయ్యి పడిపోయింది. దీంతో కాలు చేయ్యి చలనం లేకుండా మారాయి. మందులు వాడుకుంటూ జిల్లా వైద్యశాలలోని ఫిజియోథెరఫీ కేంద్రానికి చికిత్స నిమిత్తం వస్తున్నా. వైద్యులు తెలియజేసే ఎక్సర్‌సైజ్‌లను చేయిస్తున్నారు. వీల్‌ఛైర్‌లో వచ్చిన నేను నేడు బయట వరకు నడవగలుగుతున్నా.

– రాజారామ్, ఐతానగర్, తెనాలి

చాలా మార్పులొచ్చాయి



రెండు సంవత్సరాల క్రితం పక్షవాతం వచ్చింది. ఎడమకాలు, చెయ్యి, నోరు పడిపోయాయి. చికిత్స నిమిత్తం ఫిజియోథెరఫీ కేంద్రానికి వస్తున్నా. అప్పటి నుంచి వివిధ పరికరాల ద్వారా థెరఫీ చేస్తున్నారు. దీనివలన అవయవాల్లో చాలా మార్పులు వచ్చాయి. అలాగే యథాస్థితిలోకి అవయవాలు వస్తున్నాయి. ఇక్కడ సేవలు చాలా బాగున్నాయి.

– యేసు మణిమ్మ, సుందరయ్యనగర్, తెనాలి.

సేవలను ఉపయోగించుకోండి



పక్షవాతం, ఉభసం, ఎముకలు విరిగిన, నడుములు నొప్పులు, కీళ్ళ నొప్పులు వంటి వాటిని ఫిజియోథెరఫి ద్వారా చికిత్స అందించవచ్చు. తెనాలి పరిసర ప్రాంతంలోని అనేక మంది రోగులు ఇక్కడకు వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. ఫిజియోథెరఫీ అవసరమైన వారు జిల్లా వైద్యశాలలోని ఫిజియోథెరఫి కేంద్రానికి వచ్చి చికిత్స పొందవచ్చు. వచ్చిన రోగులకు వారి వ్యాధి తీవ్రతను బట్టి వివిధ రకాల పరికరాలతో చికిత్స అందిస్తాం.

– డాక్టర్ అపర్ణ, ఫిజియోథెరఫిస్ట్, జిల్లా వైద్యశాల, తెనాలి

• గోవింద నామ సంకీర్తనకు..



పట్టణానికి చెందిన శ్రీవెంకటేశ్వర అన్నమాచార్యుల సంకీర్తన బృందం, సాయిరాం సంగీత కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం 108 మంది చిన్నారులు, 200 గాయకులు తిరుమలకు బయలుదేరి వెళ్లారు. 27వ తేదీన ఉదయం 10–11 గంటల వరకు గోవింద నామ సంకీర్తన, అనంతరం మధ్యాహ్నం 2 గంటల వరకు తిరుమల ఆస్థాన మండపంలో 300 మందిచే అన్నమయ్య సంకీర్తనల గానాలాపన ఉంటుందని తెలిపారు. పిల్లలు, పెద్దల్లో భక్తి భావన పెరగటానికి మరియు అన్నమయ్య సంకీర్తన, గోవింద నామ ప్రచార నిమిత్తం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు కొండపి శ్రీనివాసరావు, వరుఖల లక్ష్మీ సునీత తెలియజేశారు, ఈ యాత్రలో సునీల్ కుమార్, పద్మజ టీచర్, డాక్టర్ వరుఖల రవిశంకర్, కోలాటం మాస్టర్ ప్రసాద్, నందిని, సీమ, ప్రసన్న, శైలజ, పార్వతి తదితరులు పాల్గొన్నారు. –తెనాలి

రెవెన్యూ సదస్సులు ప్రజలు వినియోగించుకోవాలి

ట్రైనీ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్



అర్జీల వివరాలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

తెనాలిరూరల్: రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఉదయం నుండి జరిగిన కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామస్తులు, రైతులు తమ తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 6 వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో రైతులు వారికి సంబంధించినటువంటి పలు సమస్యల్ని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని, అలానే ప్రజా సమస్యలు కూడా పరిష్కారం చేస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల కోసం 10, సర్వే కోసం 14 అర్జీలు వచ్చాయి. వీటిని త్వరలో పరిస్కరిస్తామని అధికారులు తెలిపారు.

ఆర్థిక నేరాలకు పాల్పడిన వ్యక్తికి ఆరేళ్ల జైలు

తెనాలిరూరల్: షేర్ల వ్యాపారం, చిట్టీల పేరుతో మోసి చేసి ఆర్థిక నేరాలకు పాల్పడిన వ్యక్తికి ఆరేళ్ల జైలు శిక్ష, జరిమారా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారధి తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెనాలి నాజరుపేటకు చెందిన సూర్యప్రకాశరావు చిట్టీలు, షేర్ల వ్యాపారం పేరిట మోసాలకు పాల్పడ్డాడంటూ పట్టణానికే చెందిన రాయుడు 2016లో పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. కేసు గురువారం విచారణకు రావడంతో సాక్షాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పార్థసారధి, నిందితుడు సూర్యప్రకాశరావుకు ఆరేళ్ల జైలు శిక్ష, రూ. తొమ్మిది వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ మహమ్మద్ సుల్తాన్ సిరాజుద్దీన్ వాదించారు.

చట్టబద్ధత ప్రకటనపై హర్షం

తెనాలి: రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, నామినేటెడ్ పోస్టులలో బీసీలకు 34 శాతం కోటా కేటాయించేందుకు కట్టుబడటమే కాకుండా, చట్టబద్ధత కూడా కల్పించి, పకడ్బందీగా అమలు చేస్తామనడాన్ని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్ల'కు న్యాయపర చిక్కులన్నింటినీ తొలగించి, యధాతధంగా 34 శాతానికి పెంచి, ఎన్నికలు జరిపిస్తామనడం సంతోషదాయకమన్నారు. సాంకేతిక, న్యాయపర సమస్యలు తలెత్తకుండా బీసీలకు రక్షణ చట్టాన్ని పకడ్బందీగా తీసుకొచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు.

వీరోచిత పోరాటాల చరిత్రకు వారసులు కమ్యూనిస్టులు

తెనాలి: సీపీఐ శతజయంతి వేడుకలను గురువారం తెనాలిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీపీఐ కార్యాలయం ఎదుట అరుణపతాకాన్ని పార్టీ సీనియర్ నాయకుడు బొల్లిముంత కృష్ణ ఆవిష్కరించారు. నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం నినాదంతో సోషలిజం లక్ష్యంగా ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల్లో నియోజకవర్గంలో పలుచోట్ల పతాకావిష్కరణలు, సమావేశాలను నిర్వహించినట్టు చెప్పారు. సీపీఐ పార్టీ ఏర్పడి వందేళ్లు అయినట్టు చెప్పారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు గురుబ్రహ్మం, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు పాశం వెంకటేష్, గండు శివ, చేపూరి సాయిపవన్, దుర్గ, అఖిల్, సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, నాయకులు పరుచూరి వెంకటేశ్వర్లు, సాంబయ్య, ఏఐవైఎఫ్ నాయకుడు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ రుణ పరిమితుల పెంపుదల

సర్వసభ్య సమావేశంలో తీర్మానాలు



తెనాలి: పట్టణంలోని నెం.22 ది తెనాలి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం స్థానిక మారీసుపేటలోని శ్రీచంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో నిర్వహించారు. బ్యాంక్ ఛైర్మన్ మంగమూరి హరిప్రసాదరావు అధ్యక్షత వహించారు. బ్యాంక్ వ్యాపార పరిధిని పెంచటం, రుణపరిమితి పెంపుదల వంటి అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే వ్యక్తిగత రుణాలను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. గృహనిర్మాణ రుణ పరిమితిని రూ.15 లక్షల నుంచి రూ.22 లక్షలకు పెంచుతూ మరో తీర్మానాన్ని ఆమోదించారు. బ్యాంక్ డైరెక్టర్లు కొణిదన నాగేంద్రరావు, దొప్పలపూడి శ్యామ్‌సన్, కార్యదర్శి కేవీవీ అమర్‌నాథ్, ఏ–తరగతి సభ్యులు, మాజీ డైరెక్టర్లు జాష్టి నరేంద్రకుమార్, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ కేసన కోటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ పెండేల వెంకట్రావు, సుంకర హరికృష్ణ, తిరుమలరావు, చుక్కపల్లి పెదబాబు, సిల్వర్ జిలాని, తాడబోయిన హరిప్రసాద్, ఫణిదపు దుర్గాప్రసాద్, మంగమూరి యుగంధర్, అహ్మద్, త్రివేణి, భాగ్యరాజ్, సైక్యం పార్థసారిధి తదితరులు పాల్గొన్నారు. బ్యాంక్ నూతన సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రంగా

తెనాలిలోని పలు రంగా విగ్రహాలకు ఘన నివాళులు



రామలింగేశ్వరపేటలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్, నాయకులు



డిపో రోడ్డులోని రంగా విగ్రహం వద్ద పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తెనాలిఅర్బన్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వంగవీటి మోహన రంగా చేసిన సేవలు మరువరానివని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా వర్ధంతిని వైఎస్సార్‌సీపీ 11వవార్డు కౌన్సిలర్ కఠారి రత్నకుమారి, కఠారి హరీష్ దంపతుల ఆధ్వర్యంలో 11వ వార్డు మూడు బొమ్మల సెంటర్ వద్ద గురువారం నిర్వహించారు. అక్కడ ఉన్న రంగా విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగా ప్రజలు కోసం పుట్టిన మనిషి అని, తన జీవితమంతా ప్రజ సేవ కోసం అంకితం చేశారని కొనియాడారు. శాసన సభ్యునిగా విజయవాడ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. అలాగే కఠారి హరీష్, షేక్ మౌలాలి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బచ్చు రంగారావు, కె.నాగరాజు, కె.నాగేశ్వరరావు, ఎంఏ శేషగిరి రావు, సిహెచ్ కిషోర్‌బాబు, శానంపూడి రఘురామిరెడ్డి, చుక్కా ఆనంద్, కోలా వాసు, మన్నవ ప్రభాకర్, కావేటి నిర్మల, బూరెల దుర్గా, గోల్డ్ రహిమా, కాళిదాసు సత్యం, ఎస్ఆర్‌కె శర్మ, పెచ్చింగ్ సుభానీ, కాళిదాసు వెంకటేశ్వరరావు, షేక్ మీరావలి, ఆర్.సాంబశివరావు, యత్రు అప్పారావు, అత్తోట చంటి, తదితరులు పాల్గొన్నారు.

- రంగా వర్ధంతిని డిపో రోడ్డులోని వంగావీటి మోహన రంగా విగ్రహం వద్ద 15వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాపుల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మరువరానిదన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సురుకుల వెంకట్రావు, ధరణికోట మల్లిఖార్జునరావు, ముత్తెంశెట్టి కోండయ్య, నరేష్, గోపాల్, కొండూరు శివయ్య, నాగరాజు, నాగిశెట్టి మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.
- రంగా వర్ధంతిని రామలింగేశ్వరపేటలోని ఆయన విగ్రహం వద్ద మాజీ కౌన్సిలర్ హరిదాసు గౌరిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బండారు రవికాంత్, మామిడిబత్తుల సుబ్రమణ్యం, గురుశెట్టి శ్రీనివాస్, బచ్చు శ్రీనివాస్, పోలిశెట్టి సాయి, తోట వంశీకృష్ణ, బెల్లపు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.
- రంగా వర్ధంతిని 5వ వార్డు నందులపేటలోని రంగా చౌక్ వద్ద నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగాను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వల్లెం మురళి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శిల్పాల శ్రీను, గ్యాలం వేణు, కాలేషా, నక్కా చెన్నయ్య, అమ్మిశెట్టి హరికృష్ణ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.
- రంగా వర్ధంతిని పురస్కరించుకుని వంగవీటి రాధా రంగా స్మారక కాపు యువజన సేవా సమితి అధ్యక్షుడు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో దాసరి సాంబశివరావు, షేక్ షఫీ, మైలా దుర్గాప్రసాద్, ఎం.లక్ష్మీనారాయణ, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల మన్ననలు పొందారు

తెనాలిరూరల్: అన్ని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి వంగవీటి మోహన రంగా అని రంగా రాధా మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు వంగవీటి నరేంద్ర పేర్కొన్నారు. వంగవీటి మోహన రంగా వర్ధంతిని పురస్కరించుకుని రూరల్ మండలం కొలకలూరు గ్రామం శివాలయం సెంటర్ వద్ద నసీమా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, బీజేపీ ఆర్టీఐ సెల్ జిల్లా కన్వీనర్ కాలిశెట్టి రమేష్‌బాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వంగవీటి నరేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అమ్మిశెట్టి హరికృష్ణ, దార్ల మహేష్, తోట నరేంద్ర, బండి చంద్రమోహన్, మోదుకూరి భాస్కరరావు, సుద్దపల్లి నాగరాజు, ఉన్నం ధర్మారావు, సుద్దపల్లి మోజస్, గొల్లమూడి వెంకటేశ్వరరావు, ధూళ్ల ఇంద్ర, ఏపూరి సత్యనారాయణ, సుంకర లక్ష్మీనారాయణ, అచ్చంశెట్టి నాగయ్య, గట్టు నాగరాజు, ముత్తే రాఘవయ్య, కొలకలూరి దుర్గారావు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగం పేరిట మోసం

తెనాలిరూరల్: విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని యువకుడిని మోసం చేసిన ఇద్దరిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొలనుకొండకు చెందిన హిరోషిత్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాడు. ఇతని అక్కను బాపట్ల జిల్లా చెరుకుపల్లికి చెందిన వ్యక్తికి ఇచ్చి గతంలో వివాహం చేశారు. 2023లో తిరిగి ఇచ్చిన ఇతనికి చెరుకుపల్లికి చెందిన రమేష్‌రెడ్డి, రవిచంద్రలు పరిచయమై విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని రూ. ఆరు లక్షలకు బేరం కుదుర్చుకుని, రూ. లక్ష అడ్వాన్సు కింద తెనాలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద తీసుకున్నారు. మిగిలిన మొత్తానికి చెక్కులు రాయించుకుని వారి వద్దే ఉంచుకున్నారు. ఏడాది దాటినా ఉద్యోగం ఊసే లేకపోవడంతో టూ టౌన్ పోలీసులను ఆశ్రయించగా గురువారం కేసు నమోదు చేసినట్టు సీఐ రాములు నాయక్ తెలిపారు.

విద్యుత్ బిల్లులు దగ్ధం

తెనాలిఅర్బన్: పెంచిన విద్యుత్ బిల్లులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలని సీపీఎం నాయకులు కె.బి.ప్రసాద్ డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లుల పెంపును నిరసిస్తూ 24వ వార్డు శాంతినగర్‌లో గురువారం సాయంత్రం బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.హామీని విస్మరించి బిల్లులను పెంచినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, కె.రవికుమార్ పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో తెనాలి క్రీడాకారుల ఘనత

తెనాలి: విజయవాడలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇటీవల జరిగిన 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల అండర్–17, అండర్–19 పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెనాలిలోని క్విక్ ఫిట్‌నెస్ ఎరీనాకు చెందిన క్రీడాకారులు పతకాలను కైవసం చేసుకున్నారు. ఏరీనా నిర్వాహకురాలు, అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ జి.సాయిరేవతి గురువారం వారిని అభినందించారు. అండర్–17లో 76 కిలోల విభాగంలో బొల్లు లిఖ్య 227.5 కిలోలల బరువులనెత్తి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. 84 కిలోల విభాగంలో ఏటూరి లక్ష్మి వినయశ్రీ 307.5 కిలోల బరువులనెత్తి బంగారు పతకం సాధించినట్టు తెలిపారు. ఈ విభాగంలో అందరికన్నా అధిక బరువులనెత్తి 48 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్ స్ట్రాంగ్ విమెన్ టైటిల్‌ను కై వసం చేసుకోవటం విశేషమన్నారు. అండర్–19 బాలుర విభాగంలో 74 కిలోల్లో తమినేని మణిచంద్ 345 కిలోల బరువులనెత్తి రజత పతకాన్ని అందుకున్నారు. క్రీడాకారులను జిమ్ యాజమాన్యం కొమ్మినేని భార్గవ్‌కుమార్, కోచ్‌లు పూసపాటి శివరామకిరణ్‌రాజు అభినందించారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

తెనాలి బ్రాంచి, మోటుపల్లివారి వీధి, కొత్తపేట, తెనాలి, గుంటూరు జిల్లా-522201

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని 13(2) క్రింద దిగువ వారికి

శ్రీ పరసా విజయ ప్రసంగి, తండ్రి: పి. కృపానందం

డోర్ నెం. 11-4-53a1, కొండ రోడ్డు, చెంచుపేట, తెనాలి, గుంటూరు జిల్లా-522201

లోన్ అకౌంట్ నెం.35209146170

మేడమ్ /సార్,

[illegible] రూ.13,76,489/- [illegible]

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరము

గుంటూరు జిల్లా, తెనాలి, తెనాలి మునిసిపాలిటీ, [illegible] ఫ్లాట్ నెం. 11లోని 111 [illegible] శ్రీ పరసా విజయ ప్రసంగి, తండ్రి: పి.కృపానందం గారికి [illegible] 19-02-2019, [illegible] ఉత్తరం: ఫ్లాట్ నెం.10 [illegible]-31.2 అడుగులు.

[illegible] 13(2) క్రింద ది.03-12-2024న తేదీన డిమాండ్ నోటీసును [illegible] SARFAESI చట్టం, 2002 [illegible]

తేది : 26-12-2024
ప్రదేశం: తెనాలి

అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)

Office mail : sakshigntadvt@gmail.com